andhrajyothy.com


ఆంధ్రజ్యోతి

గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.6 : కనిష్ఠం 26.2

నిర్మల్ జిల్లా వార్తలు

8


శుక్రవారం 21 జూన్ 2024



నేడు ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి

నిర్మల్ కల్చరల్, జూన్ 20 : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరి రావు తెలిపారు. జయశంకర్ చౌరస్తా వద్ద జరిగే కార్యక్రమానికి శ్రేణులు, నాయకులు హాజరుకావాలని కోరారు. నీట్ పరీక్ష రద్దు చేయాలని ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులకు మద్దతుగా పాల్గొంటామని తెలిపారు.

జాడలేని వాన



• పత్తి విత్తనాలు మొలకెత్త లేదని తొలగించిన దృశ్యం



• ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు



• విత్తనాలు విత్తుతున్న దృశ్యం

- జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదు
- ఖరీఫ్ ప్రారంభంలోనే అన్నదాతలకు తప్పని తిప్పలు
- మొలకెత్తని విత్తనాలు
- ఆందోళనలో అన్నదాతలు

ముథోల్, జూన్20: వానాకాలం ప్రారంభంతోనే రైతులకు కష్టాలు మొదలయ్యాయి. వర్షాకాలం మొదలై పక్షం రోజులు దాటినా వర్షాలు ఆశించిన స్థాయిలో కురువలేదు. జిల్లావ్యాప్తంగా చాలాచోట్ల లోటు వర్షాపాతమే. జిల్లాలో లోటు వర్షాపాతం వానాకాలం సాగులో రైతులకు ఆగచాట్లు తప్పడం లేదు. అరకొర వానలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నీటి జాడ లేక సాగులో అన్నదాతలంతా తడబాటుకు గురవుతున్నారు. ఏం చేయాలో తెలియక కరుణించవా వరుణదేవా అంటూ వేడుకుంటున్నారు. భూగర్భ జలం తగ్గిపోవడం, వర్షాలేకపోవడంతో రైతులకు తీవ్రమైన అగచాట్లు ఎదురవుతున్నాయి. ఎక్కువశాతం రైతన్నలంతా పత్తి, సోయా, వరి సాగుకే మొగ్గు చూపుతున్నారు. ఇందులో భాగంగా జిల్లాలో ఈపాటికే సుమారు లక్ష ఎకరాల్లో పత్తి, 80వేల ఎకరాల్లో సోయా విత్తనాలు విత్తారు. దీంతోపాటు మరికొందరు రైతులు వరి నారుమడులు వేసుకునేందుకు సమాయత్తం అవుతుండగా నీళ్ల కొరతతో వెనుకడుగు వేస్తున్నారు. వర్షం పడితే దుక్కిదున్నేందుకే రైతులు సమాలోచనలు చేస్తున్నారు. రెండు మూడుమార్లు కురిసిన చిన్నపాటి వానలకు దుక్కి దున్నేందుకు కూడా పొలాలు అనుకూలంగా లేకపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సీజన్ ప్రారంభంతోనే నైరుతి రుతుపవనాల రాక మొదలైందన్న ప్రచారం జోరుగా వినిపించింది. చిరుజల్లులతో కూడిన వానలు పడడంతో రైతన్నలంతా పంటల సాగుకు ఢోకా లేదనుకొని సిద్ధమయ్యారు. జిల్లాలో చాలామంది పత్తి, సోయా విత్తుకున్నారు. 15 రోజుల క్రితం నుంచి చినుకుజాడ లేకపోవడంతో విత్తిన సోయా, పత్తి ఎటూ కాకుండా పోతోంది. 4 రోజుల క్రితం కొన్ని మండలాల్లో వర్షం కురిసినా ఆశించిన స్థాయిలో కురువలేదు. సగంమంది రైతులు వేసిన విత్తనాలు మొలకెత్తకపోవడంతో ఆ చేనును దున్నేసి వేరే విత్తనాలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. మొలకెత్తాల్సిన పత్తి, సోయా పత్తా లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. సోయాబీన్, పత్తి పంటల సాగు నడుం బిగించిన వారంతా పెట్టిన పెట్టుబడి డబ్బులు కూడా చేతికి రాక, సీజన్ ఆరంభంలోనే నష్టాలు చవిచూడడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలా చాలా చోట్ల పంటల సాగుపై వర్షాభావ పరిస్థితులు రైతులను దెబ్బతీస్తున్నాయి. మొన్నటివరకు యాసంగి పంట ఉత్పత్తులను అమ్ముకొని వానాకాలం పంటల సాగుకు సిద్ధమైన వారంతా వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. నిరాశజనకమైన వాతావరణ పరిస్థితుల మూలంగా ఏమీ చేయలేక ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో లోటు వర్షపాతమే..

నిర్మల్ జిల్లాలో ఎక్కువ మండలాల్లో లోటు వర్షాపాతం నమోదైంది. జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాపాతం నమోదు కాలేదు. ఇప్పటివరకు సాధారణ వర్షాపాతం 85.3 మిల్లీమీటర్ల వర్షాపాతం కురవాల్సి ఉండగా, కేవలం 65.8 మిల్లీమీటర్ల వర్షాపాతం నమోదైంది. అంటే మైనస్ 19.5 మిల్లీమీటర్ల లోటు వర్షాపాతం నమోదైంది. జిల్లాలో లక్షా 40 వేల ఎకరాల పత్తి పంటకు గాను దాదాపు లక్ష ఎకరాలలో రైతులు పత్తి విత్తనాలు విత్తారు. ఇందులో ఎక్కువ శాతం పొడి నెలల్లోనే విత్తారు. ఇందులో ఎక్కువశాతం పొడినేలల్లోనే విత్తారు. ఇప్పటికే పత్తి విత్తనాలు మొలకెత్తకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

రైతులూ.. తొందరపడొద్దు !

మంచి వర్షాలు కురిసే వరకు రైతులు ఎదురుచూడాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి అంజి ప్రసాద్ సూచిస్తున్నారు. వాతావరణ పరిస్థితుల ప్రకారం వ్యవసాయ అధికారుల సలహాలతో రైతులు ముందుకు వెళ్లాలని చెప్తున్నారు. వర్షాలు కురవకముందే విత్తనాలు విత్తి వర్షం కోసం ఎదురుచూస్తూ పెట్టుబడి నష్టపోవద్దని సూచిస్తున్నారు.

పది బ్యాగుల పత్తి విత్తి నష్టపోయా..



• విఠల్ రెడ్డి, ఎడ్‌బిడ్

నేను పది బ్యాగుల పత్తి విత్తనాలు ఐదు ఎకరాల్లో 15 రోజుల క్రితం విత్తాను. కానీ అక్కడక్కడ కేవలం రెండు బ్యాగులు సరిపడేంత విత్తనాలు మట్టికే మొలకలు రాగా, మిగతావి మొలకెత్తలేదు. వర్షాలు లేని కారణంగా రూ.60వేల వరకు పెట్టుబడి నష్టపోయాను. మళ్లీ ఈ చేనును మొత్తం చెరిపేసి సోయా విత్తనాలు వేసేందుకు సన్నద్ధమవుతున్నాను.

విత్తనాలు మొలకెత్తడం లేదు..



• అమృత్, రైతు, విట్టోలి తండా

నేను నా మూడు ఎకరాల చేనులో సుమారు 30 వేల రూపాయలు పెట్టుబడితో ఆరు బ్యాగుల పత్తి విత్తనాలను విత్తాను. కానీ అది సరిగ్గా మొలకెత్తలేదు. ఏం చేయాలో అర్థం కాక వేరే పంట వేసేందుకు సిద్ధమవుతున్నాను. వర్షాలు కురిసి ఉంటే విత్తనాలు మొలకెత్తేవి.

శివాజీ స్ఫూర్తి యువతకు ఆదర్శం



శివాజీ పట్టాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఏలేటి

నిర్మల్ కల్చరల్, జూన్ 20:ఛత్రపతి శివాజీ స్ఫూర్తి యువతకు ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం శివాజీ పట్టాభిషేకం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. శివాజీ చౌక్‌లోని శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మొఘల్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మహావీరుడు శివాజీ అని కొనియాడారు. శివాజీ సమితి జిల్లా అధ్యక్షుడు మేడిసెమ్మె రాజు, జిల్లా బీజేపీ అధ్యక్షుడు అంజు కుమార్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ ఈశ్వర్, బీజేపీ నాయకులు అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, సామ రాజేశ్వర్‌రెడ్డి, సత్య నారాయణగౌడ్,సాధంఅరవింద్, తదితరులు పాల్గొన్నారు.

'బార్డర్‌లో భారీ పేకాట అడ్డా' కథనానికి స్పందన

• జిల్లా సరిహద్దులో పోలీసు చెక్‌పోస్టు ఏర్పాటు



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మహారాష్ట్ర సరిహద్దుల్లో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నిర్మల్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా సరిహద్దులోని మహారాష్ట్ర పరిధిలో అప్పారావుపేట్ సమీపంలో జోరుగాసాగుతున్న పేకాట దందాపై గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన'బార్డర్‌లో భారీ పేకాట అడ్డా' కథనానికి జిల్లా ఎస్పీ జానకి షర్మిల స్పందించారు. ఈ మేరకు నిర్మల్ జిల్లా, మహారాష్ట్ర బార్డర్‌లో ఉన్న సిరిపెల్లి వద్ద చెక్‌పోస్టును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా వైపు నుంచి మ హారాష్ట్రకు వెళ్లే అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూ చించారు. అలాగే ఈ చెక్‌పోస్ట్ వద్ద సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ తెలిపారు.

'నీట్ పరీక్ష అవకతవకలపై విచారణ జరపాలి'

నిర్మల్ కల్చరల్, జూన్ 20: నీట్ పరీక్షా పత్రం లీకేజీలో ఎన్‌టీఏ, ఉన్నతాధికారుల పాత్ర ఉందని దానిపై సుప్రీం కోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని సీపీఎం డిమాండ్ చేసింది. గురువారం జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద ధర్నా ఆందోళన చేసి నిరసన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ... పరీక్ష నిర్వహణ బాధ్యత నుంచి ఎన్టీఏను తప్పించాలని, నిర్వహణ బాధ్యత రాష్ట్రాలకు అప్పగించాలని కోరారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.నూతన్‌కుమార్, పట్టణ కార్యదర్శి ఫసియుద్దీన్, సభ్యులు శంభు, సాయిరెడ్డి, దిగంబర్, సాయికిరణ్, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఖానాపూర్, జూన్ 20: పట్టణ శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే ఖానాపూర్ ఎస్సై లింబాద్రి తెలిపిన కథనం ప్రకారం... పట్టణంలోని శ్రీరాం నగర్‌కు చెందిన ఆగుట్ల నర్సయ్య అనే వ్యక్తి తన టీవీఎస్ ఎక్సల్ ద్విచక్ర వాహనంపై ఖానాపూర్ వైపు నుండి ఎగ్బాల్‌పూర్ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ఓకారు నర్సయ్య ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో నర్సయ్యకు పలుచోట్ల తీవ్ర గాయాలయ్యాయి. ఎడమకాలు ఎముక విరిగిపోయి బయటకు వచ్చింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నర్సయ్యను మెరుగైన వైద్యం కోసం నిర్మల్ తరలించారు. కారు డ్రైవర్ రజనీష్ అనే వ్యక్తి కారును అజాగ్రత్తగా, అతి వేగంగా నడపడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని ఎస్సై పేర్కొన్నారు. ఈ విషయమై నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వస్తువు నాణ్యతపై వినియోగదారులకు అవగాహన కల్పించాలి

• జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్

నిర్మల్ టౌన్, జూన్ 20 : వస్తువు నాణ్యతపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భారత నాణ్యత ప్రమాణాల సంస్థ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్) ఆధ్వర్యంలో వస్తువుల నాణ్యత ప్రమాణాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి వస్తువు నాణ్యతపై వినియోగదారులకు అగాహన కల్పించవలసిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. నాణ్యమైన వస్తు సేవలను పొందడం ప్రతి వినియోగదారుడి హక్కు అని, ప్రజలకు వస్తువుల నాణ్యత ప్రమాణాలపై, నాణ్యత లోపాలపై ఫిర్యాదులు చేయు అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. భారత నాణ్యత ప్రమాణాల సంస్థ ప్రతి వస్తువుకు నిర్దిష్టమైన నాణ్యత ప్రమాణం నిర్దేశించబడుతుందని, ప్రమాణాలు ఉత్పత్తిదారులు ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ వారు ఉత్పత్తిదారులకు సర్టిఫికెట్లు మంజూరు చేయడం వల్ల ప్రజలకు నాణ్యమైన వస్తువులు అందుతాయని తెలిపారు.ఐఎస్ఐ హాల్ మార్క్, ఇతర రకాలైన సర్టిఫికెట్లను ఈ సంస్థ జారీ చేస్తుందని వీటిపై అధికారులకు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. వీటిపై అవగాహనను పెంపొందించడం కోసం పాఠశాలలో ఎనిమిదవ తరగతి నుంచి స్టాండర్డ్ క్లబ్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమా వేశంలో బ్యూరో ఆఫ్ ఇండియన్ డిప్యూటీ డై రెక్టర్ కెవిన్, స్టాండర్డ్ ప్రమోషన్ ఆఫీసర్ అభిసాయి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నిరుపయోగంగా డంప్‌యార్డ్‌లు

• ఎరువుల తయారీకి వచ్చే ఆదాయానికి గండి • సేకరించిన చెత్తను కాల్చి వేస్తున్నవైనం



వృధాగా పడి ఉన్న డంపింగ్ యార్డ్

సారంగాపూర్,జూన్20: గ్రామాల్లో స్వచ్ఛత దిశగా పని చేస్తున్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. వ్యర్థాలతో ఎరువులను తయారు చేసేందుకు ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డ్‌లు నిరుపయోగంగా మారాయి.పల్లెల్లోఇంటి నుంచి సేకరించిన చెత్తను కాల్చివేస్తూ పర్యావరణానికి ముప్పు వాటిల్లే విధంగా చేస్తున్నారే తప్ప డంపింగ్‌యార్డ్‌లో నిర్మించినషెడ్లలో ఎరువులు తయారు చేసే దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.గత ప్రభుత్వం పల్లె ప్రగతిలో భాగంగా గ్రామ పంచాయతీలకు డంపింగ్ యార్డ్‌లను నిర్మించి గ్రామాల్లో ప్రతిఇంటికి వెళ్లి తడి, పొడి చెత్తను సేకరించి తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేయాలని గ్రామ స్థాయి అధికారులకు అవగాహన కల్పించారు. వేర్వేరు చేసిన చెత్తను డంపింగ్ యార్డ్‌లో 45 రోజుల్లో వర్మీకంపోస్ట్‌ను తయారు చేసి గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలో పెంచుతున్న మొ క్కలకు వేసి మిగిలిన వర్మీకంపోస్ట్‌ను విక్రయించి వచ్చినటువంటి ఆదాయాన్ని గ్రామ పంచాయతీ అభివృద్ధి పనులకు ఉపయోగించాలని సంబంధిత అధికారులకు సూచించారు.మండ లంలో 32 గ్రామపంచాయతీలలో డంపింగ్ యార్డ్‌లతో పాటు సెగ్రిగేషన్ షెడ్లులను నిర్మిం చారు. దీంతో కొన్ని గ్రామ పంచాయతీల లోనే వర్మీకంపోస్ట్‌ను తయారు చేయడం మొదలు పెట్టి ప్రస్తుతం మర్చిపోయారు. ప్రస్తుతం గ్రామాల్లో ఇంటింటా తిరిగి సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్‌లలోనే కాల్చి వేస్తుండడంతో ప్రభుత్వ ఆదేశాలు తుంగలో పెట్టినట్లు అవుతుందని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా తడి, పొడి చెత్తను వేర్వేరు తయారు చేసి వర్మీకంపోస్ట్‌ను తయారు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు

సీఎంను కలిసిన ట్రిపుల్ ఐటీ ఉద్యోగ సంఘ నేతలు



ముఖ్యమంత్రికి వినతి పత్రాన్ని అందజేస్తున్న ట్రిపుల్ ఐటీ అధ్యాపకులు

బాసర, జూన్, 20: బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీ ఉద్యోగ సంఘం నేతలు గురువారంహైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి తమ సమ స్యలను విన్నవించారు. ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు ముఖ్య మంత్రితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. యూనివర్సిటీ స్థాపించిన నాటి నుంచి పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని, పీఆర్‌జీ సీని, యూజీసీ 7వ వేతనం ప్రకారం చెల్లించాలని కోరారు. సమస్యలపై ముఖ్య మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ట్రిపుల్ ఐటీఅధ్యాపకులు తెలిపారు. ట్రిపుల్ ఐటీ అధ్యాపకుల సంఘం శ్రీశైలం, తదితరులు సీఎంని కలిసిన వారిలో ఉన్నారు.

'అధిక ఫీజులు వసూలు చేసే పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి'

నిర్మల్ కల్చరల్, జూన్ 20: నిర్మల్ జిల్లాలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యతీసు కోవాలని ఎస్ఎఫ్ఎస్ ఏటీపీపీ డిమాండ్ చేసింది. గురువారం కన్వీనర్ శివ కుమార్ మాట్లాడుతూ.. ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని, కార్పొరేట్ పాఠశాలల దోపిడీ అరికట్టాలన్నారు. యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాశాఖ మంత్రిని నియమించి నాణ్యమైన విద్య అందించాలని కోరారు. మెగాడీఎస్సీ నిర్వహణ, మధ్యాహ్న భోజనం అవకతవకలపై దృష్టి సారించాలన్నారు. పర్యవేక్షణకు ఎంఈవోలను నియమించాలన్నారు. దుర్గాప్రసాద్, సన్నీ, దినేష్, మహేష్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రొసీడింగ్ కాపీ అందజేత

కుంటాల,జూన్,20:మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామంలో గల శివాలయం వద్ద రేకుల షెడ్డు నిర్మాణానికి రూ. 2 లక్షలు, మరియు పెంచికల్‌పాడ్ గ్రామం నుంచి భైంసా మండలం తిమ్మాపూర్ గ్రామం వరకు రోడ్డు మరమ్మతులకు గుంతల్లో మొరం వేసేందుకు రూ.2 లక్షల ప్రొసీడింగ్ కాపీని గురువారం జడ్పీటీసీ గంగామణి బుచ్చన్న ఆధ్వర్యంలో గ్రామస్తులకు అందజేశారు జడ్పీ నిధుల నుంచి ఈ పనులు చేపట్టనున్నట్లు వారు తెలిపారు.

అందరి సహకారంతో జిల్లా అభివృద్ధి: కలెక్టర్



జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ కల్చరల్, జూన్ 20: అందరి సహకారంతో జిల్లా అభివృద్ధి సాధ్యమని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ జానకి షర్మిల ఏర్పాటు చేసిన తేనీటి విందుకు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతల అమలు తీరును కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పోలీసు శాఖకు అన్ని విధాలా సహాయ సహకారం అందిస్తామన్నారు. జిల్లాలో శాంతి భద్రతలపై కలెక్టర్‌కు ఎస్పీ వివరించారు. రెవెన్యూ, పోలీసు, జ్యూడీషియల్ శాఖలు సమర్థవం తంగా పని చేసినప్పుడే సత్ఫలితాలు వస్తాయన్నారు. జిల్లాలో శాంతిభద్ర తలు అదుపులో ఉన్నాయని తెలిపారు. జిల్లా న్యాయాధికారులు జి. రాధిక, ఆర్. అజయ్ కుమార్, జే. భవిష్య, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, తదితరులు హాజరయ్యారు.

కలెక్టర్‌ను కలిసిన రైస్ మిల్లర్లు



కలెక్టర్‌కు మొక్క అందిస్తున్న రైస్ మిల్లర్లు

నిర్మల్‌కల్చరల్, జూన్ 20: జిల్లా నూతన కలెక్టర్ అభిలాష అభినవ్‌ను జిల్లా రైస్ మిల్లర్ల సంఘ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. కలెక్టర్‌కు మొక్కను అందించారు. గౌరవ అధ్యక్షుడుగంగారెడ్డి, అధ్యక్షుడు సట్లవార్ రమేష్, సభ్యులు బచ్చువార్ మహేష్, ఎస్.మహేష్, విజయ్, దాస్,సతీష్ రావు,రాము, రీగస్ రావు కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

• కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ ఛైర్మన్

నిర్మల్ మున్సిపల్ ఛైర్మన్ ఈశ్వర్ జిల్లా నూతన కలెక్టర్ అభిలాష అభినవ్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.కౌన్సిలర్లు గండ్రత్ రమణ, లక్కాకుల నరహరి, ఎడపల్లి నరేందర్, నాయకులు నర్సాగౌడ్, అడప పోశెట్టి, తదితరులున్నారు.

• నూతన కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన గెజిటెడ్ ఉద్యోగులు

నిర్మల్ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అభిలాష అభినవ్‌ను గురువారం జిల్లా గెజిటెడ్ ఉద్యోగుల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేశారు. కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు. జిల్లా అభివృద్ధిలో తమవంతు సహాయ సహకారం అందిస్తామని తెలిపారు. అధ్యక్షుడు డాక్టర్ పీజీ రెడ్డి, సురేష్, రవికుమార్, సాయినాథ్, విఠల్, తదితరులు పాల్గొన్నారు.

• కలెక్టర్‌కు అభినందనలు తెలిపిన పీఆర్టీయూ

నూతన కలెక్టర్ అభిలాష అభినవ్‌ను గురువారం పీఆర్టీయూ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందించి అభినందించారు. అధ్యక్షుడు సాయన్న, హరిప్రసాద్, చంద్రకాంత్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల సందర్భంగా రావాల్సిన గౌరవ వేతనాలు అందించి సర్టిఫికెట్లు అందజేయాలని వారు కోరారు.

ఘనంగా రేండ్ల పోచమ్మ ఆలయ వార్షికోత్సవం

ఖానాపూర్,జూన్ 20: మండలంలోని మేడంపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న రేండ్ల పోచమ్మ అమ్మవారి ఆలయ నాలుగో వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా గురువారం అమ్మవారికి బోనాల సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో అమ్మవారి బోనాలను ఘనంగా ఊరేగించారు. ఈ ఊరేగింపులో మహిళలు నెత్తిన బోనాలతో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బోనాల ఊరేగింపు సందర్భంగా నిర్వహించిన పోతురాజుల విన్యాసం ఆకట్టుకుంది. అనంతరం అమ్మవారికి పట్నం వేసి, ఒడి బియ్యం పోసి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

ఉట్నూర్,జూన్20:ఉట్నూర్ మండల కేంద్రంలోని బోయవాడలో ఆసుపత్రి సమీపంలో ఉన్న గల్లీలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా తయారయ్యాయని ప్రజలు వాపోతున్నారు.ఇళ్లకు సమీపంలో విద్యుత్ తీగలు వంగి పోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంతో ఉన్నామని ప్రజలు వివరిస్తున్నారు.ఈవిషయమై విద్యుత్ అధికారులకు పలుమార్లు చెప్పిన పట్టించు



ఉట్నూర్ బోయవాడలో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

కోవడం లేదని ఎమ్మెల్యే బొజ్జుపటేల్ విద్యుత్ అధికారులను వంగిన తీగలను తొలగించాలని ఆదేశించాలని ప్రజలు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఉట్నూర్, జూన్20: ఐకేపీ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఉట్నూర్ మండల కేంద్రంలోని బోయవాడకి చెందిన రాజలింగు కుటుంబాన్ని జిల్లా కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నాయకురాలు ఆత్రంసుగుణక్క పరామర్శించారు. ఇ టీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ నాయకురాలు ఆత్రంసుగుణ గురువారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాజలింగు మృతి పట్ల ప్రగాఢ సా నుభూతి తెలిపారు. ప్రభుత్వ పరంగా వచ్చే ఆర్థిక సాయం త్వరగా అందేలా కృషి చేస్తానని సుగుణక్క హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నా యకులు కనక సుదర్శన్,పెందూర్‌గణపత్ మహిళనాయకులు పాల్గొన్నారు.

'పన్నేతర ఆదాయ పరిమితి పెంచాలి'

నిర్మల్ అర్బన్, జూన్ 20: వచ్చే నెలలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే పూర్తిస్థాయి బడ్జెట్‌లో పన్నేతర ఆదాయ పరిమితిని ప్రస్తుతమున్న రెండు లక్షల యాభై వేల నుంచి ఎనిమిది లక్షలకు పెంచాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు విజ్ఞప్తి చేశారు. గత దశాబ్ద కాలంగా ఈ పరిమి తిలో మార్పులేదని, ఈసారైనా పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కాలంలో ధర లు వంద నుంచి రెండు వందల శాతం పెరిగాయని, కానీ ఆదాయ పన్ను పరి మితి విషయంలో మార్పులు లేవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పరిమితి పెంపు లేకపోవడం వల్ల లక్షలాది మంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ బడ్జెట్ కసరత్తు ప్రారంభించిన సందర్భంగా ఆయన కేంద్ర ప్రభుత్వానికి పై విధంగా విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో మన రాష్ట్రానికి చెందిన భాజపా, కాంగ్రెస్ పార్టీల లోక్ సభ, రాజ్యసభ సభ్యులు చొరవ తీసుకోవాలని కోరారు. ఈ విషయమై నివేదించడానికి త్వరలోనే అన్ని పార్టీల ఎంపీలను కలుస్తామని ఆయన పేర్కొన్నారు.

సంకల్ప బలంతో ఏదైనా సాధించవచ్చు



మోటివేట్ చేస్తున్న నటుడు ప్రదీప్, హాజరైన ఉపాధ్యాయులు

నిర్మల్ కల్చరల్, జూన్ 20: సంకల్ప బలంతో విద్యార్థులు దేన్నైనా అవలీలగా సాధించవచ్చునని ప్రముఖ నటుడు, ప్రేరకుడు ప్రదీప్ అన్నా రు. గురువారం ఆర్‌కే కన్వెన్షన్ హాల్‌లో ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన మోటివేషన్ తరగతు లకు ఆయన హాజరై విద్యార్థులు తమ సూచన లతో ఉత్తేజం కలిగించారు. విద్యార్థులు ప్రతిదీ పాజిటివ్‌గా ఆలోచించాల న్నారు. ఇష్టంగా చదవాలని సూచించారు. ఇతరులతో పోల్చుకోరాదని, లేని దానికి బా ధపడక ఉన్నదానిపై ఫోకస్ పెట్టాలన్నారు. ఆలోచనలతో మన సు అల్లక ల్లోలం చేసుకోవద్దన్నారు. మనసుంటే మార్గం ఉంటుంద న్నారు. పరీక్షలు చదు వులో భాగమని వాటిని చూసి ఆందోళన చెందవ ద్దని తెలి పారు. ఓట మిని చూసి నిరాశ చెందవద్దని ఓటమి అనేక పా ఠాలు నే ర్పుతుందన్నారు. నేటి ఓటమే రేపటి గెలుపుకు నాంది అన్న విషయం గ్రహించాలన్నారు. చది విన విషయాలు గుర్తుంచుకొని జీవితా నికి అన్వ యించుకొని ఆచరించాల న్నారు. అప్పుడే చదువుకు సార్థకత లభిస్తుంద న్నారు. ఉపాధ్యాయులు మారుతున్న కాలానికి అనుగుణంగా తాము బోధనలో నూతన ఆలోచనలు జోడించి చేప ట్టాలన్నారు.ఉపాధ్యాయులు,విద్యార్థులకుజీవితంలోని అను భవాలు ఉదాహ రిస్తూ ఉత్తేజపరి చారు. ట్రస్మా జనరల్ సెక్రటరీ ఎస్‌ఎన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సంక్షేమం కోసంశిక్షణ కార్యక్రమాలు చేపడు తున్నామ న్నారు. ట్రస్మా జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ రావు, పట్టణ అధ్యక్షుడు చంద్ర గౌడ్,పద్మనాభగౌడ్,శ్రీనివాస్,వినోద్,నాగభూషణం, రామారావు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడి మృతి

ఉట్నూర్, జూన్20:ఉట్నూర్ మండల కేంద్రంలోని నాగిరెడ్డినగర్‌కు చెందిన 9ఏళ్ల బాలుడు అనుమానస్పద స్థితిలో మృతి చెందాడని ఉట్నూర్ ఎస్సై మనోహర్ తెలిపారు. నాగిరెడ్డినగర్‌కు చెందిన రాథోడ్‌గోపాల్ తొమ్మిదేళ్ల కుమారుడు మూడు రోజుల క్రితం అదృశ్యమయ్యాడని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గురువారం కేంద్రంలోని గోపాయి చెరువులో బాలుడిశవం తేలడంతో తల్లిదండ్రులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోస్టుమార్టం అనంతరం తల్లిదండ్రులకు శవాన్ని అప్పగించామని తెలిపారు. 9ఏళ్ల బాలుడు ఎలా మృతి చెందాడు అన్న విషయాలను సమగ్రంగా పరిశీలిస్తున్నామని తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


యోగా చేస్తున్న దృశ్యం (ఫైల్)

ఆదిలాబాద్‌అర్బన్,జూన్20:యోగాతో లభించే శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్య ప్రయోజనాలను ప్రోత్సహించడానికి జూన్ 21న అంతర్జా తీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్నారు.జూన్ 21న ప్రపంచ వ్యా ప్తంగా 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిం చనున్నారు. యోగా అంటే చాలామంది శరీరాన్ని అసాధ్యమైన భంగి మల్లోకి తిప్పడం అని అర్థం చేసుకుంటారు. యోగా అంటే శరీరాన్ని మె లికలు తిప్పడం లేక తలకిందులుగా నుంచోవడం కాదు. యోగా అనేది ఒక వ్యాయామ పద్ధతి కాదు. అది మనిషిని తను చేరుకోగల అత్యు న్నత స్థితికి చేరవేసే ఒక సంపూర్ణ సాంకేతిక పరిజ్ఞానం. అసలు " యోగా అంటే ఐక్యం" అని అర్థం. మీరు అన్నింటితో ఐక్యం అయితే అదే యోగా. నిజానికి మానవుని యొక్క అనంతమైన మేదాశక్తి, ఆత్మశక్తిల కలయిక యోగా.ప్రతియేటా జూన్ 21న యోగా దినోత్సవం నిర్వహి స్తున్నారు. ఇప్పుడు యోగా ప్రాముఖ్యత ప్రపంచ వ్యాప్తంగా అందరికి తెలిసింది. ఎందుకంటే యోగాసనాలు చేస్తే శారీర కంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. అంతేకాకుండా మానసిక ప్ర శాంతత, మనస్సు చురుకుగా ఉంటుంది. ఇప్పుడు ఎక్కువగా జిమ్, వర్కౌట్స్ కంటే యోగా సనాల పైనే ఇంట్రెస్ట్ చూపిస్తు న్నారు. యోగా వ్యక్తులను శారీరకంగా, మానసికంగా దృఢంగా మార్చ డంలో చాలా ప్రభావవంతంగా పని చేస్తుంది.శరీరానికి సమతుల్యత కల్పించడం, ఆరోగ్యకరమైన శరీరాకృతి, భంగిమను అందించడం, జీవక్రి యను మెరుగు పరచడం, అలసటను తగ్గించడం వంటి సాధారణ సమస్యల నుంచి హృదయ స్పందన రేట ను నియంత్రించడం,అధిక రక్త పోటు, గుండెపోటు, మధుమేహం, ఒత్తి డి స్థాయిలను తగ్గించడం వంటి తీవ్రమైన అనారోగ్య సమస్యలకు యోగా పరిష్కారం చూపుతుంది. యోగాలో చాలా రకాలుగా ఉన్నాయి. చాలా రకాల ఆసనాలు, భంగిమలు, యోగా ముద్రలు మొదలైనవి ఒక్కో అంశానికి ప్రత్యేకంగా నిర్దేశించినవి. యోగా ఏరోబిక్ వ్యాయా మాలు ఊపిరి బిగపట్టే సామర్థ్యాన్ని పెంచుతాయి.ఇది హృదయం, శ్వాసకోశ వ్యవస్థలను మెరుగు పర్చడం లో సహాయ పడుతుంది. కొంత మందికి ఏదైనా చిన్న పని చేసినా, శరీరానికి కాస్త శ్రమ కలిగినా లేదా కొద్ది దూరం నడిచినా చాలా ఆయస పడిపోతారు. ఊపిరి వేగంగా పీల్చుకుంటారు. ప్రతి సంవత్సరం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించడంలో భాగంగా ఒక నిర్దిష్టమైన థీమ్‌ని తీసుకుంటారు.2024 సంవత్స రంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా "యోగా ఫర్ సెల్ఫ్‌అండ్ సొసైటీ "అన్న థీమ్‌ను తీసుకున్నారు. అంటే యోగా మనకోసం, మనసొసైటీ కోసం అన్న థీమ్‌తో ప్రతి ఒక్కరు యోగ సాధ న చేయాల్సిన అవసరాన్ని చెబుతున్నారు.

1. నౌకాసనం

యోగాలోని నౌకాసనం వ్యక్తుల్లో శక్తి, సామర్థ్యాలను పెంచే ఆసనం. ఇది ఒత్తిడిని తగ్గించడంతో పాటు వివిధ శారీరక సమస్యలను ఎదుర్కొ వడంలో సహాయపడుతుంది. ఈ ఆసనం వేయడం ద్వారా తుంటి కీళ్లు, కాళ్లు బలోపేతం అవుతాయి. అలాగే చేతులు, తొడలు, భుజాలలోని కం దరాలను బలపరుస్తుంది. ఉదరఅవయవాలు, కండరాలు ఉత్తేజితమ వుతాయి. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. శరీర స్థిరత్వం పెరుగుతుఉంది.

2. బాలసనం

ఇది సులభమైన యోగా ఆసనం. కాని చాలా శక్తివంతమైనది. చాతి, వీపు, భుజాలలో ఒత్తిడిని తగ్గించడం ద్వారా కండరాలకు విశ్రాంతి ఇస్తుంది. ఒత్తిడి, ఆందోళనను తగ్గించడమే కాకుండా మిమ్మల్ని రోజంతా చు రుకుగా ఉంచుతుంది.

3. ఉష్ట్రాసన

ఈ ఆసనం వేయడం ద్వారా చాతి విస్తరిస్తుంది. తద్వారా శ్వాసక్రియ మెరుగు పడుతుంది. ఇదేకాకుండా ఈ ఆసనం వేయడం ద్వారా భుజా లు, వీపు, తుంటి, నడుము, కండరాలను సాగదీయడం,బలోపేతం చే యడంతో పాటు ఉదర ప్రాంతాన్ని విస్తరించడం ద్వారా జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది. మలబద్ధకం సమస్యను నివారిస్తుంది. ఇది వెన్ను పూసకు విశ్రాంతినిస్తుంది. నడుము నొప్పిని తగ్గిస్తుంది. మీ శరీర భంగీ మను మెరుగు పరుస్తుంది.

రైతు ఆత్మహత్యలను నిలువరించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి

● తెలంగాణ రాష్ట్ర రైతు సం ఘం నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఖానాపూర్, జూన్ 20: రైతు ఆత్మహత్యలను నిలువరించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్‌ఆర్ ఉపాలి డిమాండ్ చేశారు. గురువారం ఖానాపూర్‌లోని తాపీ మేస్త్రీ సంఘ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రైతు రుణమాఫీ హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. రైతు బంధును సకాలంలో రైతులకు చెల్లించాలన్నారు. రైతు సమస్యలపై చర్చించేందుకు ఈ నెల 25వ తేదీన జిల్లా కేంద్రంలోని భారత కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నిర్మల్ జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి రైతులు, నాయకులు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు అంకం శంకర్, కడకుంట్ల రవి, చిలుకూరి ఇస్తారి, కోమటిపల్లి భీమయ్య, మాదాసు రాజేశ్వర్, కడకుంట్ల నర్సింహులు, తదితరులున్నారు.

భాషా పండితుల నిరసన

ఆదిలాబాద్‌అర్బన్,జూన్20:ఉపాధ్యాయుల పదోన్నతుల బదిలీ ఉత్తర్వుల పై విద్యాశాఖ ఎడతెగని జాప్యం చేయడాన్ని నిరసిస్తూ గురువారం ఆదిలాబాద్ డీఈఓ కార్యాలయం ఎదుట భాషా పండితులు నిరసన చేపట్టారు.తప్పులు తడకగా జాబితాలు రూపొందించి ఆ తర్వాత సరిదిద్దామని ప్రకటన జారీ చేసి మూడు రోజులైనా ఆదిలాబాద్ జిల్లా ఉపాధ్యాయుల చేతికి ఇంత వరకు ఉత్తర్వులు రాక పోవడం పై టీచర్లు అసహనం వ్యక్తం చేశారు.అనంతరం డీఈఓ ప్రణీతను కలసి పరిస్థితి వివరించగా డీఈఓ విద్యాశాఖ ఆర్జేడీ లింగయ్యతో మాట్లాడి పదోన్నతుల ఉత్తర్వుల గురించి వివరించారు. ఎలాగైనాతప్పనిసరిగా ఉత్తర్వులు జారీ చేస్తామని హామీ ఇవ్వడంతో భాషా పండితులు వెనుదిరిగారు.

ఘనంగా 'తాతాయి'

సారంగాపూర్,జూన్ 20: మండలంలో గల అడెల్లిలో గురువారం ఘనంగా తాతాయి పండగను నిర్వహించారు. ఈ సంద ర్భంగా గ్రామస్తులు నూతన వస్త్రాలను ధరించి డప్పు మేళాలతో ఊరేగింపుగా తాతాయి ఆలయానికి వెళ్లి పూజలు చేసి ఏడాది పాటు గ్రామస్తు లందరూ సుఖ సంతోషాలతో ఉండాలని మొక్కులను మొక్కారు. అలాగే వేసినటువంటి పంటలకు అధిక దిగుబడులు రావాలని దేవతలను వేడుకున్నారు

ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యం ఇవ్వండి


విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం


షాంపూర్ పాఠశాలలో అల్బెండోజల్ మాత్రలు వేస్తున్న దృశ్యం

లక్ష్మణచాంద,జూన్ 20: విద్యార్థులు తమ ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూరిభా గాంధీ బాలికల పాఠశాల, కళాశాల విద్యార్థులకు గురువారం నులి పురుగు నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... విద్యార్థులంతా తమ ఆరోగ్యం పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులకు అందుతున్న వసతులు, సౌకర్యాలను గురించి అడిగి తెలుసుకున్నారు. వారికి పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్‌ను అందజేశారు. ఎలాంటి సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులంతా క్రమ శిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, తహసీల్దార్ జానకి, ఎంపీడీవో రాంప్రసాద్, ఈవోపీఆర్‌డీ, ఆర్‌ఐ, ప్రత్యేక అధికారి, హెచ్‌ఈవో ఉపాధ్యాయులు, తదిత రులు ఉన్నారు.

భైంసారూరల్: మండలంలోని పిప్రి ప్రాథమిక పాఠశాలలో 78 మంది విద్యార్థిని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను గురువారం పంపిణీ చేశారు. డీఎంహెచ్‌వో ఈ సందర్భంగా మాట్లాడు తూ... నులి పురుగులతో మనిషి ఎదుగుదల ఉండదని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే తప్పకుండా విద్యార్థి దశ నుండే ఈ మాత్రలు వేసుకోవాలని డాక్టర్ ఇద్రిస్ సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో మోజాం హుస్సేన్, హెచ్‌ఈవో సలీం, నాలుగో వార్డు కౌన్సిలర్ చందులాల్, జడ్పీటీసీ సోలంకి భీంరావు, సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

తలమడుగు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం జాతీయ నూలి పురుగుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలందరికీ నులి పురుగులను నివారించేందుకు తప్పకుండా మాత్రలను వేయించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో మండల వైద్యుడు డాక్టర్ హరీష్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు వినోద్‌రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు, మంజుల, పద్మ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్: జాతీయ నులిపురుగుల నివారణ నిర్మూలన దినం పురస్కరించుకుని ఉట్నూర్ మండలంలోని షాంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రాథోడ్ సందీప్‌నాయక్ ఆధ్వర్యంలో 19ఏళ్ల లోపు పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. పీహెచ్‌సీ పరిధిలో ఉన్న ఆశ్రమ పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలు, ప్రాథమిక ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న 19ఏళ్ల లోపు పిల్లలకు నులిపురుగుల నివారణ కోసం మాత్రలు వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


ఖానాపూర్: జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండలంలోని పాత ఎల్లాపూర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో గురువారం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలను అందజేసి నులి పురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, జిల్లా నాయకులు లక్ష్మీపతి గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షులు గైని రాజేశ్వర్, మాజీ ఎంపీపీ శంకర్ గౌడ్, నిట్ట రవి, ధర్మరాజు, పాఠశాల ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మల్ కల్చరల్: 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా నులి పురుగుల నివారణ మాత్రలను అందజేయాలని జిల్లా వైద్యాధికారి ధనరాజ్ అన్నారు. గురువారం సోఫీనగర్ గురుకుల పాఠశాలలో కళాశాల, పాఠశాల విద్యార్థులకు నివారణ మాత్రలు అందజేశారు. వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యమన్నారు. భోజనానికి ముందు విద్యార్థులు తప్పనిసరి చేతులు శుభ్రపర్చుకోవాలన్నారు. బహిరంగ మలమూత్ర విసర్జన మానుకుంటే అనేక రకాల నుండి రక్షణ పొందవచ్చునన్నారు. ఉపవైద్యాధికారి రాజేందర్, డీఈవో రవీందర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: నులి పురుగులను నివారిస్తేనే చిన్నారుల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంలోని స్థానిక జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో చిన్నారులకు నులి పురుగుల నివారణ మాత్రలు వేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఒకటి నుంచి 19 సంవత్సరాల వయసు గల పిల్లలందరికీ తప్పనిసరిగా నులి పురుగుల నివారణ మాత్రలు వేయించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యులు రాంమోహన్, జడ్పీటీసీ పుష్పలతా, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మనీషా, పీహెచ్‌ఎన్ జ్యోతి, హెల్త్ సూపర్ వైజర్ శ్రీనివాస్, ఏఎన్‌ఎం పద్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.


కుంటాల: సంపూర్ణ ఆరోగ్యానికి నులిపురుగుల మాత్రలు ఎంతో అవసరమని వైద్యాధికారి శృతి అన్నారు. గురువారం మండల కేంద్రం కుంటాల స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు నులి పురుగుల మాత్రలు వేశారు. ఈ కార్యక్ర మంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది ఉన్నారు.

నేరడిగొండ:పిల్లలను నులిపురుగుల నుంచి సంరక్షించాల్సిన బాధ్యత పోషకులపై ఉందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎండీ సద్దాం అన్నారు.గురువవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌సెకండరీ పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. .పాఠశాలలు, కళాశాలలు, అంగన్ వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ తదితరులు పాల్గొన్నారు.




ప్రైవేటులో పుస్తకాలు అమ్మకానికి ఉంచిన షెటర్ సీజ్

ఆదిలాబాద్ రూరల్, జూన్20: ఆదిలాబాద్ మదర్స్ కేర్ ప్రైవేట్ పాఠశాలలో పాఠ్య పుస్తకాలు అమ్ముతుండగా ఏబీవీపీ నాయకులు పట్టుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు డీఈవో అక్కడికి రావాలని సీజ్ చేయాలని ఏబీవీపీ నాయకులు బైఠాయించి నిరసన తెలిపారు. దీనిపై డీఈవో ప్రణీత స్పందించి చర్యలు చేపట్టాలని ఎంఈవోను ఆదేశించగా.. ఎంఈవో జయశీల గురువారం పుస్తకాలు అమ్ముతున్న షెటర్‌ను సీజ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు అక్షయ్, కార్తీక్, మహేష్, నిఖిల్, సర్వజిత్ పాల్గొన్నారు.



బదిలీల్లో.. పైరవీల జోరు!

» ఉద్యోగుల బదిలీల్లో పెరిగిపోతున్న రాజకీయ జోక్యం » కాంగ్రెస్ పార్టీ నేతల చుట్టూ అధికారుల చక్కర్లు
» ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా చక్రం తిప్పుతున్న నేతలు » కీలక పోస్టింగ్‌లలో నియోజకవర్గ ఇన్‌చార్జీలదే పైచేయి



ఆదిలాబాద్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన బదిలీల మాదిరిగానే ప్రస్తుత ప్రభుత్వ కీలక శాఖల అధికారుల బదిలీల్లోనూ రాజకీయ జోక్యం కన్పిస్తోంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో మళ్లీ అధికారుల బదిలీలు ఊపందుకుంటున్నాయి. ముఖ్యంగా పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, ఇతర ముఖ్య శాఖల్లో అధికారుల బదిలీలకు నేతల సిఫారసులు తప్పనిసరిగా మారింది. అధికార పార్టీ నేతల అనుమతి ఉంటేనే అనుకూలమైన చోట పోస్టింగ్‌లు దక్కే అవకాశం ఉంది. అయితే జిల్లాలో ఖానాపూర్ నియోజకవర్గం తప్ప అధికార పార్టీకి చెందిన నేతలెవరు ఎమ్మెల్యేలుగా గెలుపొందలేదు. దీంతో ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలైన అభ్యర్థులే నియోజకవర్గ ఇన్‌చార్జీలుగా కొనసాగుతున్నారు. వీరి సిఫారసులకే రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఇన్‌చార్జీలకే అధిక ప్రాధాన్యత ఏర్పడుతోంది. ఆదిలాబాద్ నియోజకవర్గంలో బీజేపీ, బోథ్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలుపొందారు. ఖానాపూర్ నియోజక వర్గంలో మాత్రం కాంగ్రెస్ ఎమ్మెల్యే విజయం సాధించారు. పలువురు ఉద్యోగులు తమకున్న పరిచయాలు, బంధుత్వాలతో జోరుగా పైరవీలు చేస్తున్నట్లు తెలుస్తోంది. నేతలు మాత్రం ఎన్నికల్లో తమకు అనుకూలంగా పనిచేసిన వారికే ప్రాధాన్యతనిస్తూ సిఫారసు చేస్తున్నట్లు సమాచారం. అయితే అధికారుల పనితీరు, వారి సామాజిక వర్గాలను పరిగణలోకి తీసుకుంటూ నియోజకవర్గాలలో పోస్టింగ్‌లు ఇప్పిస్తున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. జిల్లాలో ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలు పూర్తిస్థాయిలో ఉండగా ఖానాపూర్, ఆసిఫాబాద్ రెండు నియోజకవర్గాలు పాక్షికంగా కొనసాగుతున్నాయి. అన్ని నియోజకవర్గాల్లోనూ అధికారుల బదిలీలపై ఖద్దర్ నేతల పెత్తనమే కనిపిస్తుందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

నేతల వద్దకు క్యూ..

దాదాపుగా అన్నిశాఖల్లో అధికారుల బదిలీల ప్రక్రియ ఊపందుకోవడంతో అధికార పార్టీ నేతల చుట్టు చక్కర్లు కొడుతున్నారు. పార్టీ ఇన్‌చార్జీలు స్థానికంగా అందుబాటులో ఉన్న విషయాన్ని తెలుసుకుంటున్న అధికారులు నేతల ఇంటి వద్ద క్యూ కడుతున్నారు. కొంత మంది అధికారులు మాత్రం ఎవరికీ అనుమానం రాకుండా హైదరాబాద్‌కు పరుగులు తీస్తూ అక్కడే నేతలతో మంతనాలు జరుపుతున్నారు. అనుకూలమైన పోస్టింగ్‌లను దక్కించుకునేందుకు పార్టీలో మంచిపలుకుబడి ఉన్న నేతలతో నియోజకవర్గ ఇన్‌చార్జీలపై ఒత్తిళ్లు చేస్తున్నారు. కాదు కూడదు అంటే ఏకంగా జిల్లా ఇన్‌చార్జీ మంత్రితో సిఫారసు చేయించే ప్రయత్నం చేస్తున్నారు. నేతలు అందుబాటులో ఉన్న విషయాన్ని తెలుసుకుంటున్న అధికారులు క్షణాల్లో వారి ఇంటి వద్ద వాలిపోతున్నారు. మర్యాద పూర్వకంగానే కలిసేందుకు వచ్చామని చెబుతున్న బదిలీల విషయం పైననే చర్చిస్తున్నారు. అవసరమైతే అడిగిన కాడికి ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన పార్టీ ఇన్‌చార్జీలు తమకు అనుకూలమైన అధికారులను మాత్రమే తమ నియోజకవర్గంలో నియమించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. అధికారాన్ని తమ గుప్పిట్లో పెట్టుకునేందుకు నేతలు ముందుచూపుతో అడుగులు వేస్తున్నారు. తమ అనుచరులు, పార్టీ కార్యకర్తలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఓటమి పాలైన పార్టీ ఇన్‌చార్జీల ఇళ్ల వద్దనే నిత్యం అధికారుల సందడి ఎక్కువగా కనిపిస్తుంది.

పార్టీ ఇన్‌చార్జీలదే హవా

ఆదిలాబాద్, బోథ్, ఆసిఫాబాద్ నియోజక వర్గాల్లో అధికార పార్టీ ఇన్‌చార్జీలదే హవా కనిపిస్తుంది. ఈ నియోజక వర్గాల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు గెలుపొందిన వారి ప్రభావం అంతంత మాత్రంగానే కనిపిస్తుంది. అభివృద్ధి పనులు, నిధుల మంజూరుతో పాటు అధికారుల బదిలీల్లోను ఇన్‌చార్జీలదే పైచేయిగా మారుతోంది. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలను కాదని అధికారుల పోస్టింగ్‌ల్లో చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తోంది. అధికార పార్టీ అండతో నియోజక వర్గానికి పలు రకాల నిధులను మంజూరు చేయించడం, ప్రభుత్వ నిర్ణయాల్లోను జోక్యం చేసుకుంటున్నట్లు తెలిసింది. ఇప్పటికే ప్రభుత్వం నియోజకవర్గ ఇన్‌చార్జీలకు రూ. 5 నుంచి రూ.10 కోట్ల వరకు నిధులను కేటాయించడంతో ఎమ్మెల్యేలకు దీటుగా అభివృద్ధి పనులను కూడా చేపడుతున్నారు. ఇటీవల జరిగిన పోలీసు, రెవెన్యూ, ఇతర ముఖ్యశాఖల అధికారుల బదిలీల్లో ఇన్‌చార్జీలదే పైచేయిగా మారిందంటున్నారు. ఎమ్మెల్యేలకు ఇష్టం ఉన్నా లేకపోయినా పలు శాఖల్లో అధికారుల బదిలీలు చకచకగా సాగిపోతున్నాయి. ఓ నియోజకవర్గంలోనైతే ఎమ్మెల్యే సిఫారసును సైతం పక్కన పెట్టి పోస్టింగ్లు ఇవ్వడం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. పలువురు అధికారుల పోస్టింగ్‌ల్లో మాత్రం ఎమ్మెల్యేల సిఫారసులను ప్రభుత్వం బేఖాతరు చేసిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. గెలిచినా అధికారంలో లేక పోవడంతో కొందరు ఎమ్మెల్యేల మాట చెల్లుబాటు కావడం లేదంటున్నారు. కేవలం ప్రొటోకాల్‌కే పరిమితమవుతున్నారన్న వాదనలూ వినిపిస్తున్నాయి. పార్టీ ఇన్‌చార్జీలు ఎమ్మెల్యేలను టార్గెట్ చేస్తూ చక్రం తిప్పడంతో నియోజకవర్గాల్లో అధికార పార్టీ నేతలదే హవా అన్నట్లుగా కనిపిస్తుంది. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జీల ఆదేశాలతో ప్రభుత్వ అధికారులు అయోమయానికి గురవుతున్నారు.

సంక్షిప్త సమాచారం

'ఉట్నూర్‌లో బీసీ హాస్టల్ ఏర్పాటు చేయాలి'

ఉట్నూర్, జూన్ 20: ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ కేంద్రమైన ఉట్నూర్ మండల కేంద్రంలో కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థుల కోసం ప్రత్యేక వసతి గృహం ఏర్పాటుచేయాలని బీసీ సంఘాలు కోరుతున్నాయి. ఉట్నూర్ మండలకేంద్రంలో ఉన్న వివిధ కళాశాలలో చదువుకోవడానికి వస్తున్న బీసీ విద్యార్థులకు ప్రత్యేక హాస్టల్ వసతిలేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, మరికొందరు చదువులకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించి ఉట్నూర్ మండలకేంద్రంలో బీసీ వసతిగృహం ఏర్పాటు చేసిన బీసీ విద్యార్థులు చదువుకునేలా ప్రోత్సహించాలని వివిధ సంఘాల నాయకులు కోరుతున్నారు.

'కనీస వేతనం రూ.27 వేలు చెల్లించాలి'

ఆదిలాబాద్‌రూరల్, జూన్20: భారత కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో వినోద్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ నారాయణ మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, భవనఇతర నిర్మాణరంగ కార్మికులకు ప్రమాదవశాత్తు చనిపోతే రూ.20లక్షలు చెల్లించాలన్నారు. నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మానం చేయాలని అన్నారు. లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు గౌరాల సుభాష్, దేవిదాస్, ఆర్కా శేషరావ్, మెస్రం మారుతి, భగత్ సంజయ్, పెర్క గంగమ్మ, రాజు, లక్ష్మణ్, ఉల్గా రాజ్, అశోక్, ప్రకాష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హరీష్, గణేష్, ఏఐకేఎంఎస్ నాయకులు వామన్ ఉన్నారు.

'చలో ఐటీడీఏ ధర్నాను విజయవంతం చేయండి'

బోథ్, జూన్20: షెడ్యూల్ ప్రాంతంలో మెగా స్పెషల్ డీఎస్సీ ఏర్పాటు చేయాలని ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఐటీడీఏలో బ్యాక్లాగ్ పోస్టులను భర్తీ చేయాలని ఈనెల 24న చేపట్టే ధర్నాలో ప్రతీ గిరిజనుడు పాల్గొని విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కడప నగేష్ కోరారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవోఎంఎస్ 3ను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. పోడుభూములు సాగుచేస్తున్న రైతులందరికీ పట్టాలు ఇవ్వాలన్నారు. జాతికోసం, జాతి భవిష్యత్తు కోసం చేపడుతున్న ఈ ధర్నా కార్యక్రమాన్ని ఆదివాసీలందరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు బాపూరావు, ఉపాధ్యక్షులు రామెల్లి భోజన్న, తుడుం దెబ్బ, డివిజన్ ఉపాధ్యక్షులు కురుమే రాజన్న, జేఏఏఐఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆడే హనుమంతు, నాయకులు చెడుమకి సీతారాం, కనక గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్షం కురవాలని.. పంటలు సమృద్ధిగా పండాలని అన్నదానం

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 20: వర్షాలు బాగా కురవాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని కాంక్షిస్తూ ఆగ్రో డీలర్లు, ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగానే గురువారం మార్వాడి ధర్మశాలలో అన్నదానం నిర్వహించారు. ముందుగా వేంకటేశ్వర స్వామికి పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీలర్ల సంఘం నాయకులు గంద్రత్‌సంతోష్ మాట్లాడుతూ ప్రతీ యేటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా కప్పతల్లి ఆట ఆడిన అనంతరం అన్నదానం చేపట్టామన్నారు. రైతులు సుభిక్షంగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని దేవున్ని ప్రార్థిస్తూ కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు.

మత్తు పదార్థాలకు అలవాటుపడి

జీవితాలను నాశనం చేసుకోవద్దు

• కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ రూరల్, జూన్ 20: యువత మత్తు పదార్థాలకు అటవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని టీచర్స్‌కాలనీలో మత్తు, మాదకద్ర వ్యాల నిర్మూలన చికిత్స, పునరావాస కేంద్రాన్ని కలెక్టర్ రాజర్షిషా గురువారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ మేరకు సిబ్బందితో మాట్లాడి కేంద్రం పనితీరును అడిగి తెలుసుకున్నారు. అన ంతరం పలు రిజిస్టర్లను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. రాత్రి డ్యూటీ వివరాలు రెఫరల్ చేసిన పేషెంట్ వివరాలు, హోం విసిట్ రిజిష్టర్, ఫాలో ఆఫ్ కేర్ షీట్, రిమ్స్ ఆస్పత్రికి ఎంతమందిని పంపించారు, ఈ రోజు మెడిసిన్ ఎంత మందికి ఇచ్చారు. యోగా టీచర్ రోజూ వ స్తున్నారా, సిబ్బంది విధులు సరిగా నిర్వహిస్తు న్నారా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నా రు. రిజిష్టర్‌లు సరిగ్గా లేకపోవడం, బెడ్స్, పరిస రాలు పరిశుభ్రంగా లేకపోవడంపై అసహనం వ్యక్తంచేశారు. బాధితులకు అవగాహన కల్పించారు. యువత మాదక ద్రవ్యాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో సబిత, ఏసీడీపీవో మిల్కా, డీసీపీవో రాజేంద్రప్రసాద్ ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

పిల్లల సంరక్షణ పట్ల అలసత్వం వద్దు

శిశు గృహాల్లో ఉన్న పిల్లల సంరక్షణ పట్ల అలసత్వం వహించొద్దని కలెక్టర్ రాజర్షిషా సిబ్బందికి సూచించారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని శిశు గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లలకి అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. లిఎల్లలకు ఆట వస్తులతోపాటు పుస్తకాల్లో రాయించడం నేర్పించాలన్నారు. రోజూ పిల్లలను అంగన్‌వాడీకి పంపాలని సూచి ంచారు. అనంతరం కలెక్టర్ పిల్లలతో మాట్లాడారు.

నులి పురుగుల నివారణకు

అందరూ కృషిచేయాలి: కలెక్టర్

ఆదిలాబాద్ రూరల్, జూన్ 20: నులి పురుగుల నివారణకు అందరూ కృషిచేయాలని కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో కలెక్టర్ విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లోని విద్యార్థులు తమ ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అంతేకాకుండా 1 నుంచి 19 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ నులిపురుగుల నివారణ మాత్రలను తమ ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుని వేసుకోవాలన్నారు. విద్యార్థులు పరిశుభ్రత పాటించాలని, ఎప్పటికప్పుడు చేతులు శుభ్రం చేసుకోవాలని అన్నారు. జిల్లాలో 1 నుంచి 19 ఏళ్ల పిల్లలు 2,21,141 మంది ఉన్నారని, వీరందరూ మాత్రలు వేసుకొనేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి రాథోడ్ రవీందర్, డీఈవో ప్రణీత, సోషల్ వెల్ఫేర్ స్కూల్ ప్రిన్సిపాల్, వైద్యాధికారులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న కలెక్టర్

నిషేధిత గుట్కా పట్టివేత

నేరడిగొండ, జూన్ 20: నిషేధిత గుట్కా తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. నేరడిగొండ బస్‌స్టేషన్‌లో ముందస్తు సమాచారం మేరకు కాపుకాసి నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన అధిర్‌మొహ్మద్ ఫారుఖ్ బస్సులో రూ.6260 విలువగల నిషేధిత గుట్కాను తీసుకు రాగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాల కోసం ఎంపిక పోటీలు

ఇచ్చోడ, జూన్20: క్రీడపాఠశాలలో ప్రవేశం కోసం ఈనెల 22న ఇచ్చోడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల పీడీ రామేశ్వర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 8, 9 ఏళ్ల విద్యార్థులు అర్హులని, బోనఫైడ్ ఆధార్‌కార్డు తీసుకొని జడ్పీహెచ్ఎస్ ఇచ్చోడలో నిర్వహిస్తున్న ఎంపిక పోటీల్లో పాల్గొనాలని పేర్కొన్నారు.

'నీట్ పరీక్షను రద్దు చేయాలి'



ఎన్‌టీఏ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు



మాట్లాడుతున్న పార్టీ జిల్లా కార్యదర్శి మల్లేష్

ఆదిలాబాద్ రూరల్, జూన్ 20: నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ గురువారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఎన్‌టీఏ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి మల్లేష్ మాట్లాడుతూ ఎన్‌టీఏ విద్యార్థుల జీవితాలతో చెలగాలమాడిందన్నారు. బిహార్‌లో పేపర్ లీక్ కావడం, ఒకో విద్యార్థి నుంచి రూ.30 లక్షలు లంచం తీసుకోవడంపై మండిపడ్డారు. ఎన్‌టీఏ చరిత్రలో ఎన్నడూ లేనంతగా 69 మందికి మొదటి ర్యాంక్ రావడం, గ్రేస్ మార్కుల పేరుతో మార్కులు అదనంగా వేయడం, జూన్ 14 నాడు విడుదల చేయాల్సిన ఫలితాలు సార్వత్రిక ఎన్నిక ఫలితాల రోజు జూన్ 4న విడుదల చేయడం చూస్తుంటే అవినీతి ఎంతటిస్థాయిలో జరిగిందో అర్థమవుతోందన్నారు. నీట్ పరీక్షను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు తొడసం భీంరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.మంజుల, సీపీఎం భీంపూర్ మండల నాయకులు ధోనిపెల్లి స్వామి, జైనథ్ మండల నాయకులు అరవింద్, సీఐటీయూ నాయకులు పండుగ పోచ్చన్న, అగ్గిమల్ల స్వామి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కె.ఆశన్న, పొచక్క, గంగారాం, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు కోట్నక్ సక్కు పాల్గొన్నారు.



కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎస్పీ గౌస్‌ఆలం

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం

• ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్ అర్బన్, జూన్20: పోలీసు వ్యవస్థకు సేవలు అందిస్తూ విధి నిర్వహణలో మృతిచెందిన పోలీసు కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటూ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఎస్పీ గౌస్‌ఆలం అన్నారు. గురువారం పోలీసు ముఖ్య కార్యాలయంలో మార్చి 8న మహాశివ రాత్రి సందర్భంగా కుంటాల జలపాతంలో విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మృతి చెందిన నేరడిగొండ పోలీసుస్టేషన్ కానిస్టేబుల్ కె.మార్కండేయ భార్య కె.సుజాత, కొడుకు నిఖిల్‌లకు భద్రతకు సంబంధించిన రూ.8లక్షల చెక్కును ఎస్పీ అందజేశారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఎటువంటి సమస్యలకైనా జిల్లా పోలీసు యంత్రాంగం ఎల్లవేళల అందుబాటులో ఉంటుందని తెలిపారు. 24 గంటలు అవిశ్రాంతంగా విధులు నిర్వహించే పోలీసులు వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. జిల్లా పోలీసు యంత్రాంగం అనారోగ్య భారీన పడకుండా ఉండేందుకు ప్రతీ సంవత్సరం మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇందులో పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారినిజైస్వాల్ కవిత ఉన్నారు.

నోట్ పుస్తకాలపై కేసీఆర్ ఫొటోలు!



మైనార్టీ రెసిడెన్షియల్‌లో విద్యార్థులకు పంపిణీ చేసిన నోట్‌పుస్తకాలు



ఆదిలాబాద్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సరఫరా చేసిన నోట్ పుస్తకాలపై మాజీ సీఎం కేసీఆర్ ఫొటోలు ముద్రించి సరఫరా చేయడం వివాదాస్పదంగా మారింది. జిల్లాలో 18 మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలోని 5వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు కేసీఆర్ ముఖచిత్రంతో ఉన్న నోట్ పుస్తకాలను అధికారులు సరఫరా చేశారు. అయితే ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన అధికారులు దిద్దుబాటు చర్యలు మొదలు పెట్టారు. ఇప్పటికే పాఠశాలలకు సరఫరా చేసిన పుస్తకాల ను వెనక్కి తిప్పి పంపేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇన్నాళ్లూ ఈ విషయాన్ని మైనార్టీ వెల్ఫేర్ అధికారులు గోప్యంగా ఉంచారు. ఆదిలా బాద్ జిల్లాలో దాదాపుగా లక్షకు పైగానే నోట్ పుస్తకాలు ఉన్నట్లు తెలుస్తోంది. త్వరలోనే కార్గో ద్వారా నోట్ పుస్తకాలను తిప్పిపంపాలని రాష్ట్ర స్థాయి అధికారులు ఆదేశాలు ఇవ్వడంతో జిల్లా అధికారులు దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 20: బంగారు గూడలోని ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న పీజీటీ ఇంగ్లీష్ ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కె.సుధారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీష్‌లో పీజీ, బీఈడీలో ఇంగ్లీష్ మెథాడాలజీ తోపాటు బోధనలో అనుభవం ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. బయోడేటా, ఫోటో, విద్యార్హతల జిరాక్స్ పత్రాలను ఈనెల 26 లోపు పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. క్లాసు డెమో, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన వారు పాఠశాలతో పాటు ఇంటర్మీడియట్ విద్యార్థులకు బోధన చేయాల్సి ఉంటుందని, అవర్లీ బేసిస్ ఆధారంగా గౌరవ వేతనం ఉంటుందని పేర్కొన్నారు.